





కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవాల్లో పాల్గొన్న అతిథులు

సహకార బ్యాంకులతో సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సహకార బ్యాంకులతోనే దేశం ఆర్థికంగా సుస్థిర అభివృద్ధి చెందుతుందని నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య వి.బాలమోహనదాస్ అన్నారు. కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ రజతోత్సవాలు సందర్భంగా ఎంవిపి.కాలనీ శాఖలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో బాలమోహనదాస్ పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కోఆపరేటివ్ రంగంలో అధునాతన సాంకేతికపరంగా ఖాతాదారులకు కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. టిడిపి నాయకులు సిహెచ్.పట్టాభిరామ్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా ప్రజల అవసరాలను తీర్చేందుకు కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సహకారం, వారి అభివృద్ధికి చేస్తున్న కృషి, సిబ్బంది చేస్తున్న సత్వర సేవలు అటు ఖాతాదారులను, ఇటు బ్యాంకును కూడా మరింత అభివద్ధి దిశలో ముందుకు తీసుకువెళ్తున్నాయన్నారు. సామాన్య ప్రజల అవసరాలను తీర్చడంలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు వినూత్న సేవలను అందిస్తుందని కొనియాడారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ ఎంవిపి కాలనీలో శాఖను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఖాతాదారుల ఆధరాభిమానాలతో సుమారు వంద కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఖాతాదారుల ఆదరణతో రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివద్ధి దిశలో తీసుకువెళ్తామన్నారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికి వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. మరికొన్ని నెలల్లో మరో నాలుగు కొత్త శాఖలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనముతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివద్ధి చెందుతూ ప్రస్తుతం 17,350 మంది సభ్యులతో రూ.32 కోట్లు వాటా ధనము పొంది, రూ.1374 కోట్ల వ్యాపారంతో అర్బన్ కోఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంక్ మాజీ చైర్మన్ పరుచూరు రఘునాధరావు మాట్లాడుతూ సాంకేతికపరంగా కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా కోఆపరేటివ్ రంగంలో ఖాతాదారులకు సేవలందిస్తున్నామన్నారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, జి.రామకృష్ణ ప్రసాద్, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్, ఒఎస్‌టి శర్మ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఉదయం ఎన్ఎడి శాఖలో జరిగిన సమావేశంలో పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ ఖాతాదారులకు బ్యాంకు చైర్మన్ శాలువాతో సత్కరించి, మెమోంటోలను అందజేశారు.

అందుబాటులోకి విఎంఆర్‌డిఎ కల్యాణ మండపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థచే పెందుర్తి మండలం చినముషిడివాడ వుడా లేఅవుట్‌లో జోగులాంబ బస్ స్టాప్ దగ్గర నిర్మించబడిన కల్యాణమండపం ఈ నెల 11 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని విఎంఆర్‌డిఎ కార్యదర్శి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మండపం ప్రత్యేకలు తెలిపారు. మరిన్ని వివరాలకు 9246165557, 9700354772 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నాడు అమరావతి.. నేడు విశాఖి

- విజన్ గ్రాఫిక్స్‌పై సర్వత్రా చర్చ
- బాబు, జగన్ సేమ్ టు సేమ్ అంటూ వ్యాఖ్యలు



విశాఖ విజన్ సదస్సులో మాట్లాడుతున్న సిఎం జగన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : 2014లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు చూపిన అమరావతి గ్రాఫిక్స్ అంతటి స్థాయిలో విశాఖను చూపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్ విశాఖ వేదికగా ప్రయత్నించారు. '2024-2034 విశాఖ విజన్'లో ఆయన పలు అంశాలను ప్రస్తావన చేశారు. మంగళవారం విశాఖలోని రుషికొండ సమీపానగల రాడిసన్ బ్లూ హోటల్‌లో 'ఎపి డవలప్‌మెంట్ సదస్సు'లో విశాఖ విజన్ డాక్యుమెంట్‌ను సిఎం జగన్ ఆవిష్కరించారు. సుమారు రూ.లక్షా 5 వేల కోట్ల 'విజన్ విశాఖ' అభివృద్ధి రాగల పదేళ్లలో జరుగుతుందని, విశాఖ ఆర్థిక, సామాజిక, భౌగోళిక రూపురేఖలు మారతాయని వెల్లడించారు. గతంలో అమరావతి రాజధానికి రూ.లక్షల కోట్లను వెచ్చించాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విజన్ జిమ్మిక్కులే మంగళవారంనాటి జగన్ సభలోనూ సాక్షాత్కారమయ్యాయి. ఈ విషయంపై పలువురు పారిశ్రామిక వేత్తలు చర్చించుకోవడం కనిపించింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళలో ఈ సదస్సుల వల్ల ప్రజల కష్టాలకు ఏమైనా తక్షణ పరిష్కారం లభించేనా ? అనే చర్చ కూడా సాగింది. జగన్ ప్రతిపాదించిన పదేళ్ల విజన్‌లో జివిఎంసి, విఎంఆర్‌డిఎ, ఎన్‌టిపిసి, హౌసింగ్, షాపింగ్ మాల్స్, కన్వెన్షన్ సెంటర్లు, రోడ్లు కనెక్టివిటీ వంటి అనేక అంశాలు ఉన్నాయి. రూ.లక్షా 5 వేల కోట్ల పెట్టుబడులు రాగల పదేళ్లలో వచ్చి రాష్ట్ర, అందునా విశాఖ రూపురేఖలు మారనున్నాయంటూ జగన్ విజన్‌ను వ్యక్తం చేశారు. దీంట్లో అత్యధిక భాగం నిధుల షేర్ కేంద్ర ప్రభుత్వం సమకూర్చాల్సిందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. పైగా ఎన్‌టిపిసి తన సొంత నిధులైన రూ.30 వేల కోట్లతో చేసే అభివృద్ధి ప్రాజెక్టును సైతం దీంట్లో జగన్ కలిపేశారు.

కేంద్రం అన్యాయం చేస్తుంటే.. విజన్ ఎలా ?

'విభజన హామీలను కేంద్రం నేటికీ నెరవేర్చలేదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీల ఊసేలేదు. పోలవరానికి, సుజల స్రవంతికి నిధులు ఇవ్వడం లేదు. రైల్వే జోన్ ఏర్పాటు వంటి వాటిల్లో తీవ్ర స్థాయిలో నిర్లక్ష్యాన్ని చూపుతోంది. ముఖ్యంగా విశాఖ ప్రగతి చిహ్నమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రమాదంలో పడేసేలా ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ విశ్వయత్నాలు సాగిస్తున్న తరుణంలో విశాఖ అభివృద్ధి ప్రత్యేకంగా ఎలా జరుగుతుంది' అన్న ప్రశ్న అందరిలో తలెత్తుతోంది. ఎపికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై అన్ని తరగతుల ప్రజానీకం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలాగ సొంత గనులు కేటాయించే విషయాన్ని కేంద్రంతో జగన్ మాట్లాడి ఒప్పించగలరా ? ఇదొక్క పనిచేస్తే రాగల పదేళ్లలో విశాఖ విజన్ నెరవేరినట్టే అన్న భావన సకల జనుల నుంచీ వ్యక్తమవుతోంది. అమరావతి రాజధాని విషయంలో కొనసాగుతున్న గందరగోళానికి తెర దించేలాగ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీయే ఎపిలో గెలుస్తుందని, తాను ఇక్కడి నుంచే ప్రమాణ స్వీకారం చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పడం ఆశావాదమే అయినా కొంత అతిశయోక్తి అంటూ సదస్సుకు హాజరైన పారిశ్రామిక నిపుణుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క అమరావతిలో వెల్లువెత్తిన భూ దందా, రియల్ ఎస్టేట్ ఆరోపణలు విశాఖలోనూ రావడం చూస్తే ఇద్దరి విజన్‌లలో తేడా లేదనిపిస్తోంది..

పాత్రికేయులకు స్థానం ఎక్కడ ?

ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఏ ప్రభుత్వంలోనూ కలగని అవస్థలు జగన్ ప్రభుత్వం వచ్చాక పెరిగాయి. మంగళవారం నాటి ముఖ్యమంత్రి కార్యక్రమాల సందర్భంగానూ ఇదే రిపీట్ అయ్యింది. రాడిసన్ బ్లూలో పారిశ్రామిక వేత్తలతో విజన్ సదస్సు, పిఎం.పాలెం కన్వెన్షన్ సెంటర్‌లో 'భవిత' వేడుక జరగ్గా రెండు చోట్లకూ పాత్రికేయులకు ఎంట్రీ లేదు. విశాఖ జిల్లా డిపిఆర్‌ఓ కార్యాలయ అధికారులు 10 పాస్‌లను మాత్రమే కొద్దిమందికి మంజూరు చేయడంతో మిగతా ప్రింట్ మీడియా ప్రతినిధులు అవస్థలు పడ్డారు. అంతేగాక మధ్యాహ్నం 2 గంటలకల్లా సిఎం ప్రోగ్రాం పూర్తయింది. కానీ సిఎం ప్రసంగం వీడియోలు మినహా సాయంత్రం ఆరు గంటల వరకూ ప్రసంగ పూర్తిపాఠాన్ని సమాచార శాఖ విశాఖ కార్యాలయ అధికారులు ఇవ్వలేని స్థితిలో పడ్డారు. రెండు వేర్వేరు కార్యక్రమాలకు అధికార, సిబ్బంది కవరేజీకి వెళ్లినా మీడియాకు సమాచారం ఇవ్వలేకపోయారు.

సిఎం జగన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రెండు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఉదయం 10:27 గంటలకు తాడేపల్లి నుంచి విశాఖ విమాశ్రయానికి ఆయన చేరుకొని అక్కడ నుంచి మధురవాడ ఐటి హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఈ క్రమంలో విశాఖ విమానాశ్రయం వద్ద, హెలిప్యాడ్ వద్ద అధికారులు, రాజకీయ ప్రముఖులు పుష్పగుచ్చాలు అందజేసి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద ఇంఛార్జి మంత్రి విడదల రజని, ఎంపి ఎంవివి.సత్యనారాయణ, విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ సనపల చంద్రమౌళి, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, డిసిపి సత్తిబాబు, నెడ్‌క్యాప్ మాజీ ఛైర్మన్ కెకె.రాజు తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం ముఖ్యమంత్రి 10:36 గంటలకు బయలుదేరి హెలికాప్టర్ ద్వారా మధురవాడ ఐటీ హిల్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద పలువురు నేతలు, అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి అక్కడ నుంచి 10:52 గంటలకు కాన్వాయ్ ద్వారా రాడిసన్ బ్లూ రిసార్ట్ వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఉన్నారు.

ఎట్టకేలకు 'మిచౌంగ్' పరిహారం

- నేడు రైతుల ఖాతాల్లో జమ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

మిచౌంగ్ తుపాను పంట నష్ట పరిహారం రైతుకు ఎట్టకేలకు అందనుంది. బుధవారం రైతుల ఖాతాల్లో ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమచేయనుంది. డిసెంబరులో వచ్చిన తుపానుకు పంట నష్టం తీవ్రంగా జరిగింది. అయితే, నష్టాన్ని గుర్తించడంలో ప్రభుత్వం పెట్టిన షరతులు రైతును కుంగదీశాయి. కష్టకాలంలో రైతును ఆదుకోవాల్సిందిపోయి, పరిహార చెల్లింపును తగ్గించేలా నిబంధనలు అమలుచేసింది. గతేడాది ఖరీఫ్ ఆరంభం నుంచి రైతుకు కష్టం తప్పలేదు. సకాలంలో వర్షాల్లేక పూర్తిస్థాయిలో సాగుచేయని పరిస్థితి నెలకొంది. కరువు పరిస్థితులు నెలకొన్నా, ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించలేదు. కనీసం అతి తీవ్ర వర్షాభావం, పంట సాగుచేయని మండలాలను కూడా కరువుగా గుర్తించలేదు. కొద్దిపాటి వర్షాలకు, జలాశయాల కింద వరి పంటవేసినా డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు పంట పాడైంది. చివరకు పెట్టిన పెట్టుబడి చేతికిరాని పరిస్థితి వచ్చింది. అయినా రైతును ఆదుకోవాలన్న ఆలోచన ప్రభుత్వానికి రాలేదు. పంట నష్టం అంచనాలో పెట్టిన షరతులతో వాస్తవ రైతులందరికీ పరిహారం అందడంలేదు. జిల్లాలో గత డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపానుతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 28,247 మంది రైతులకు చెందిన రూ.11.29 కోట్ల విలువైన పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. 27,833 మంది రైతులకు చెందిన 16,413 ఎకరాల్లో రూ.11.16 కోట్ల విలువైన వరి పంట నష్టం జరిగింది. 58.92 ఎకరాల్లో నాలుగు లక్షల విలువైన చెరకు దెబ్బతింది. 33 శాతానికిపైగా నష్టపోయిన పంటను గుర్తించడంతో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందడంలేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిహారం నిధులు విడుదలచేసి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు తెలిపారు.

భీమునిపట్నం : డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. ఆనందపురం మండలంలో 188 మంది రైతులకు చెందిన 101.88 ఎకరాల వరి పంట దెబ్బతింది. అందుకు ప్రభుత్వం రూ.7 లక్షలా వేయి 403 పరిహారం ఇవ్వనుంది. భీమిలి మండలంలో 210 మంది రైతులకు చెందిన 184.03 ఎకరాల వరి పంట దెబ్బతింది. అందుకు ప్రభుత్వం రూ.12 లక్షలా 66 వేలా 684 పరిహారం ఇవ్వనుంది. పద్మనాభం మండలంలో 196 మంది రైతులకు చెందిన 154.39 ఎకరాల వరి పంట దెబ్బతింది. అందుకుగాను ప్రభుత్వం రూ.10 లక్షలా 60 వేలా 382 పరిహారం ఇవ్వనుంది.

జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు హారిక ఎంపిక

ప్రజాశక్తి -కశింకోట : జాతీయస్థాయి క్యారమ్స్ పోటీలకు జంటపురెడ్డి తుని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఎంఎస్‌కె.హారిక ఎంపికయ్యారు. ఇటీవల 51వ రాష్ట్ర స్థాయి క్యారమ్స్ ఛాంపియన్ షిప్‌లో హారిక మొదటి స్థానం సాధించించి. దీంతో ఏప్రిల్ 6 నుండి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలి యర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ మేరకు జె.తుని సచివాలయంలో మంగళవారం హారికను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొన అరుణ, నాగేశ్వరరావు, కార్యదర్శి మేరీ జోన్స్, కొన వెంకట సత్యనారాయణ సిబ్బంది, పాల్గొన్నారు.



తాజాగా సాధించిన ట్రోఫీతో హారిక



ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఫార్మాసిటీలో భద్రతా ప్రమాణాలు పాటించాలని ర్యాలీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవంలో భాగంగా యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం ఫార్మాసిటీలోని విజయశ్రీ నుండి ఐఓసీ బాటిలింగ్ కంపెనీ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఫార్మా సిటీలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కార్మికులకు భద్రతా పరికరాలు ఇవ్వాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో తానాం, తాడి, పరవాడ, సమీప గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు కే అప్పలరాజు, జి చిట్టిబాబు, ఎస్ అప్పలనాయుడు, ఎం కొండబాబు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ రుచికరంగా ఉండాలి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సమర్ధవంతంగా నిర్వహించాలని స్థానిక ఎంఈఓ-2 బిఎస్ఎన్ మూర్తి కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మిడ్ డే మీల్ వర్కర్లు, ఆయా పాఠశాలల హెచ్ఎంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని ప్రతిరోజు అందించాలన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన మహిళలకు పోటీలు

ప్రజాశక్తి-కశింకోట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఐద్వా ఆధ్వర్యాన కసింకోటలోని సత్తమ్మ కాలనీలో మంళవారం మహిళలు, శ్రామిక మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి ఎక్కడమ్మా నువ్వు లేనిది - ఏమిటి నువ్వు చేయలేనిది అనే పాటను పాడి వినిపించారు. అనంతరం మహిళలతో ఆమె మాట్లాడుతూ పురుషులతో సమాన పని చేస్తున్నా మహిళలకు సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు తనూజ, నారాయణమ్మ, జే.విజయ, వి.వనిత, టి.భాగ్యశ్రీ, ఎం.మాధురి, జె.మంజు, బి.వీరలక్ష్మి, ఎస్.శ్యామల, డి.నూకరత్నం,సిఐటియు. నేత శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

పుస్తకాలతో యువతలో మార్పు

సినీ కథ, పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి -అనకాపల్లి : దారితప్పిన యువతను పుస్తకాలతో మార్పు తీసుకురావచ్చని ప్రముఖ తెలుగు సినిమా కథ, పాటల రచయిత, సాహితీవేత్త సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. శ్రీగౌరి గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ వీసా, పాస్‌పోర్టు లేకుండా గ్రంథాలయాలు, పుస్తకాలతో విశ్వ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు. గతంలోకి, భవిష్యత్‌లోకి తీసుకెళ్లేది పుస్తకమేనన్నారు. లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలో మార్పులపై ప్రజలను సామాజిక గీతాలతో చైతన్యపర్చాల్సిన బాధ్యత రచయితలకు, సాహిత్యానికి ఉందని చెప్పారు. ప్రపంచంలో 40 శాతంకు పైగా ఆరేళ్ల లోపు పిల్లలు అశ్లీల దృశ్యాలు చూస్తున్నారని, అందుకు వైజ్ఞానిక సాధనాలే కారణమని పేర్కొన్నారు. మొబైల్, అంతర్జాలం వినియోగంపట్ల తల్లిదండ్రులు పిల్లలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని అశోక్ తేజ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సీనియర్ జర్నలిస్ట్ పివి.సీతారామ్, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ బి.ముత్యాలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ఉపాధ్యక్షులు కర్రి గంగాధర్, కె.జగ్గారావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్‌ఎఫ్ఐ), బొడ్డేడ జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సుద్దాల అశోక్‌తేజకు నూకాంబిక అమ్మవారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

నూకాంబికను దర్శించుకున్న సుద్దాల

అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని సుద్దాల అశోక్ తేజ మంగళవారం దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరికి ఈఓ బండారు ప్రసాద్, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలు పెంపకందారులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం నర్సాపురం గ్రామంలో గొర్రెలు, మేకలు పెంపకం దారులు తాతల తండ్రుల కాలం కాలం నుంచి గొర్రెలు, మేకలు, పశువుల నిలుపుకొని, ఉమ్మడిగా ఉపయోగించుకుంటున్న స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి అక్కడున్న పాకలను కొంతమంది తొలగించారని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఎపి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంట శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాధితులతో కలిసి సంఘటనా స్థలాన్ని శ్రీరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకలను దౌర్జన్యంగా తొలగించడం దారుణమన్నారు. దీనిపై 40 మంది మహిళలు ఎమ్మెల్యే ధర్మశ్రీకి ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించకపోగా, కంచాలు పట్టుకొని ఊరులో అడుక్కు తినండంటూ వెటకారంగా మాట్లాడటం దారుణమన్నారు. ఇప్పుడైనా బాధితులకు బేసరత్తుగా క్షమాపణ చెప్పి పెంపకందారులు స్థలాలను వారికి అప్పగించాలని, లేదంటే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు దేవర అప్పారావు, సానబోయిన గోవింద్, గొర్రెలు పెంపకలదారుల సహకార సంఘాల నాయకులు నంబారు మాలినాయుడు, చొప్పా వెంకట అప్పారావు, బూర అప్పారావు, అన్నపూర్ణ, పాల్గొన్నారు.



పాకలు పీకేసిన స్థలంలో నిరసన తెలుపుతున్న బాధితులు

బాలిక పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకర ప్రవర్తన

- అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి- మునగపాక : అభంశుభం తెలియని ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని స్థానికులు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మండల కేంద్రం మునగపాకలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పరవాడ డిఎస్పి సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం... మునగపాక ఎంపీపీ స్కూల్లో చదువుతున్న బాలికను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తుండడంతో ఆ బాలిక తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలమంచిలి సిఐ గఫూర్, స్థానిక ఎస్సై ప్రసాదరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లాలో ఈనెల 2, 3, 4, తేదీల్లో జరిగిన జాతీయస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలలో చోడవరం గణేష్ డిఫెన్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పాల్గొని పతకాల సాధించారు. జి.యుగంధర్ 60 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్,, కే.మణికంఠ 75 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారు. విజేతలను కిలాని గణేష్, పుల్లేటి గణేష్ అభినందించారు.

8న భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని బంగారుమెట్ట -పి.భీమవరం రోడ్డులోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజలు, భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగతుందని ఆలయ కమిటీ సభ్యులు తమరాన దాసు, కాళ్ల కోటేశ్వరరావు, పెనపాడు రామనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా మలసాల కిషోర్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి -కశింకోట : వైసిపి కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఉగ్గినిపాలెంలోని కిషోర్ గెస్ట్ హౌస్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేకు కట్ చేసి, పలువురు నాయకులు కిశోర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కలగ గున్నయ్యానాయుడు, వియ్యపు భూలోకనాయుడు, కలగ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టెన్త్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం టెన్త్ విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అనకాపల్లి డివిజన్ సెక్రెటరీ ఎస్.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎస్ఎఫ్ఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఎస్సై సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ పోటీ పరీక్షల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ నమూనా పరీక్షలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీత బహుమతులు వరుసగా ఎ.అమృతవర్షిని, పి దుర్గా ప్రసాద్, ధన్యశ్రీ సాధించగా, వారికి, 13 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, నాయకులు జి.తరుణ్, దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్‌కు జివి పరిశోధన కేంద్రం హోదా పొడిగింపు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలకు మూడేళ్లపాటు జీవి పరిశోధన కేంద్రాల హోదాను పొడిగిస్తూ జేఎన్టీయూ ఉత్తర్వులు అందజేసింది. ఈ మేరకు జేఎన్టీయూ విజయనగరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె వెంకట సుబ్బయ్య, రిజిస్టర్ జి జయసుమ, డైరెక్టర్ కే బాబు నుంచి డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ అధికారికంగా లేఖను అందుకున్నారు. పరిశోధనా ప్రవృత్తిని పెంపొందించడానికి డైట్ తరచుగా వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తుందని రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుజాత, డాక్టర్ ఎ.నళినీకుమారి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం పిసినికాడలో ఈనెల 7న జరుగుతున్న ముఖ్యమంత్రి బహిరంగసభను విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కర్ రావు, పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, జాజుల లక్ష్మీ ప్రసన్న రమేష్, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద్, మందపాటి జానకిరామరాజు, కోరుకొండ రాఘవ, అనకాపల్లి పట్టణ, మండల అర్బీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శంకరం గ్రామంలో పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న దీనబంధు

ఇపిఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి –గాజువాక : ఇపిఎఫ్– 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్ రిటైర్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు డిమాండ్ చేశారు. పెదగంట్యాడ సిద్ధార్థనగర్లో మంగళవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9 వేలు, దానికనుగుణంగా డిఎ ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ కల్పించాలని, హెల్త్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నమ్మి అప్పలనాయుడు, శెట్టి అప్పారావు, నలుపు వెంకటరావు, ఎన్వి.రమణ, సోమిరెడ్డి అప్పారావు, సన్యాసిరావు పాల్గొన్నారు.


ఎంపిక శిబిరంలో మాట్లాడుతున్న గణబాబు

వయోవృద్ధులకు ఆసరా 'వయోశ్రీ'

ప్రజాశక్తి –గోపాలపట్నం : జాతీయ వయోశ్రీ యోజన పథకం వృద్ధులకు ఎంతో ఉపయోగకరమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం జాతీయ వయోశ్రీ యోజన పథకం లబ్దిదారుల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా వృద్ధులు రూ.12 వేల విలువచేసే ఉపకరణాలు పొందవచ్చని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ పేద వయోవృద్ధుల కోసం ఈ పథకాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. వయోవృద్ధులు పేరు నమోదు చేసుకుని కళ్లజోడు, చెవి వినికిడి సాధనం, వీల్ చైర్, మెడ, నడుము బెల్టులు, ఊత, చంక కర్రలు పొందాలని సూచించారు. పలువురు వృద్ధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పేర్లు నమోదుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ప్రభుత్వ వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జె.మాధవి, కార్యక్రమ కో–ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలిమ్ కో ప్రతినిధులు సోమనాథ్, అంకిత్, సోనాలి, జివిఎంసి ఏడిసి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి–సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి కనకమ్మవారి వీధిలో అనధికారికంగా నిర్మించిన అంతస్తు డకింగ్ను తొలగించినట్లు టిపిఒ ప్రమీల తెలిపారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు పరిశీలించి తొలగించినట్లు చెప్పారు. ఈ తొలగింపులో చైన్మ్యాన్ రాజు, ప్లానింగ్ సెక్రెటరీ హేమ తదితరులు పాల్గొన్నారు.

జై జవాన్ ఫౌండేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి– ఆనందపురం : ఆనందపురంలో కుప్ప రాజశేఖర్, కుప్ప రామలక్ష్మి దంపతులు జై జవాన్ ఫౌండేషన్ స్థాపించి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవలస జంక్షన్ బ్రిడ్జి వద్ద 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను మాట్లాడుతూ, ఫౌండేషన్ స్థాపించిన నుంచి ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తూ మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరర్ కుప్ప రామలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఇమంది శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు రాము, వంశీ, శ్రీను, బద్రి, శ్యామ్కుమార్, శశి, స్వామి, మధు, లక్ష్మి, చిన్నరాజు, పెద్దరాజు, శివ పాల్గొన్నారు.

అందరి సహకారంతో విద్యార్థుల సంఖ్య పెంచాలి

గ్రామ పెద్దలకు పాఠశాల సిబ్బంది విన్నపం


పద్మనాభం ఎంపిపిని సన్మానిస్తున్న మద్ది పాఠశాల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి –యంత్రాంగం

పద్మనాభం : గ్రామస్తులు అందరి సహకారంతో మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి ప్రసన్న కోరారు. మద్ది పాఠశాల ప్రాంగణంలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపిపి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రస్తుతం 219 మంది విద్యార్థులకు 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్య 260 దాటి ఉండాలని చెప్పారు. 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరూ హిందీలో మాట్లాడే నైపుణ్యం కలిగి ఉన్నారని తెలిపారు. క్రాఫ్ట్, డ్రాయింగ్, క్రీడల్లో మంచి నైపుణ్యం పొందారని వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థులను తమకు అప్పగిస్తే ప్రత్యేక శ్రద్ధతో వారి అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. అనంతరం ఎంపిపి రాంబాబును, ఎంఇఒ పి.రమణను, ఆనాధ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఆర్.జగదీష్బాబును, సర్పంచ్ బి.సన్యాసమ్మను, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావును, కళాకారుడు సుబ్రహ్మణ్యాన్ని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల సిబ్బందిని ఎంపిపి సన్మానించారు.

పలు పాఠశాలల్లో వీడ్కోలు సభలు

మండలంలోని అనంతవరం రెడ్డిపల్లి, తాళ్లవలస పాఠశాలల్లో కూడా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

భీమునిపట్నం : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సూచించారు. స్థానిక జివిఎంసి హైస్కూల్లో బెస్ట్ విద్యార్థుల ఫేర్ వెల్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సింహాచలం మాట్లాడుతూ, ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నయీమ్, సుజాత కుమారి, అల్లాడ శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కవులు చైతన్యం నింపారు

గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి –భీమునిపట్నం : ఎంతోమంది ఉత్తరాంధ్ర కవులు సమాజంలో చైతన్యం నింపారని ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. స్థానిక కళా సాహితీ సంస్థ ఆధ్వర్యాన మంగళవారం తెలుగు పాటకు జాతీయ స్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజతో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మాట – పాట పేరుతో ఇష్టా గోష్ఠి నిర్వహించారు. అశోక్ తేజను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంగపండు ప్రసాదరావు లాంటి కవులెందరో రాసిన పాటలు సమాజంలో చైతన్యం నింపినట్లు తెలిపారు. సామాన్య జనం కష్టాలను, కన్నీళ్లను స్పృశింప జేసే పాటలు నిత్యం సజీవంగా నిలుస్తాయన్నారు. కళా సాహితీ సంస్థ అధ్యక్షులు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ కార్యదర్శి ఎ.సన్యాసిరాజు, గౌరవాధ్యక్షులు ఆర్.వెంకటఅప్పల నరసయ్య, సాహితీప్రియులు ఎ.కిషోర్, కె.సన్యాసినాయుడు, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.


సుద్దాల అశోక్తేజ దంపతులను సత్కరిస్తున్న కళా సాహితీ సంస్థ ప్రతినిధులు

'ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరం'


మట్టిరోడ్డులా మారిన తారు రోడ్డు

ప్రజాశక్తి –తగరపువలస : స్థానిక సంగివలస ముగ్గురు అమ్మవార్ల గుడి పక్కన ఇటీవల జివిఎంసి భీమిలి జోన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తాగునీటి సరఫరా నిమిత్తం పైపు లైన్ వేశారు. హైవే నుంచి పద్మనాభం మండలం సామయ్యవలస పంప్ హౌస్ వరకు నాణ్యతతో కూడిన పైపు లైన్ వేశారు. పైపు లైన్ ఏర్పాటుకోసం తవ్వేసిన తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. దీంతో అటు ఇటు వాహనాలపై రాకపోకలు సాగించే వారు దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులు దుమ్ము ధూళితో అవస్థలు పడుతున్నారు. వెంటనే రోడ్డును పునర్నిర్మించాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.


తుంపాల శ్రీరామ్మూర్తిని సన్మానిస్తున్న నాయకులు

హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

ప్రజాశక్తి– గాజువాక : హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని హైకోర్టు హక్కుల న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు అన్నారు. విదసం ఐక్య వేదిక, నిర్వాసితుల ఐక్య సంఘం, యూనియన్ స్టీల్ ఎంప్లాయీస్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం లౌకికవాదం సవాళ్లు అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిచ్చుక శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన హక్కులను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రజలు ఇటువంటి ఉద్యమాలలో ఐక్యంగా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. విదసం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బూసి వెంకటరావు మాట్లాడుతూ, లౌకిక వాదాన్ని అన్ని వ్యవస్థలలో కూల్చివేతలకు మనువాద శక్తులు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇటువంటి చర్యల వల్ల లౌకికవాదానికి తూట్లు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ, వ్యవస్థలు పరిణామక్రమంలో వాటి రూపాలను మార్చుకుంటూ ఉండడాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం తుంపాల శ్రీరామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, ఎస్ఆర్.వేమన, కె.పరంధామయ్య, బూసి పరమేశ్వరి, ఉక్కు ఐక్య సంఘం నాయకులు ఉమ్మడి అప్పారావు, పితాని భాస్కర్, ఎఐటియుసి నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, నిర్వాసిత నాయకులు బసా సాదురెడ్డి పాల్గొన్నారు.

ఎపిసిసి అధికార ప్రతినిధిగా జెర్రిపోతుల



ప్రజాశక్తి –గాజువాక : ఎపిసిసి అధికార ప్రతినిధిగా జెర్రిపోతుల ముత్యాలు నియమితులయ్యారు. ఈ మేరకు ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల నియామక ఉత్తర్వులు మంగళవారం విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముత్యాలు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి – ఆరిలోవ : ఎన్టిఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యాన గురువారం చినగదిలి సాయిబాబా గుడి వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి–పెందుర్తి : జివిఎంసి 94, 95 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చినట్లు తెలిపారు. సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకే అందిస్తున్నామన్నారు. విశాఖను అభివృద్ధిలో జగన్మోహన్రెడ్డి ప్రథమ స్థానంలో నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్రాజు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు 'అక్షర' విద్యార్థులు

ప్రజాశక్తి – చీడికాడ : రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు అక్షరశ్రీ విద్యానికేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బొబ్బిలి మధు తెలిపారు. ఇటీవల జరిగిన జోనల్స్థాయి పోటీలలో జూనియర్ విభాగంలో ప్రగడ రాజీ రోషిణి ప్రథమ స్థానం, సీనియర్ విభాగంలో గుల్లిపల్లి అభినయ్, బొబ్బిలి జానేశ్వర్ ప్రథమ ద్వితీయ స్థానాలతో సత్తా చాటి, ఈనెల 10న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సత్తా చూపిన విద్యార్థులను అభినందించారు.

వాగ్వాదం.. తోపులాటలు

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


కౌన్సిల్ సమావేశంలో వాదులాడుకుంటున్న వైసిపి, టిడిపి సభ్యులు

ప్రజాశక్తి–నర్సీపట్నం టౌన్ : స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అధికార, విపక్ష కౌన్సిలర్ల వాగ్వాదం, తోపులాటలతో రసాభాసగా జరిగింది. మంగళవారం మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధిపై జరిగిన చర్చ వాగ్వాదంతో మొదలై, అయ్యన్న తనయుడు 25 వార్డు కౌన్సిలర్ రాజేష్, మున్సిపల్ వైస్చైర్మన్ కోనేటి రామకృష్ణ మధ్య వాదులాట తీవ్రమైంది. కొత్తవీధి రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందని టిడిపి కౌన్సిలర్ మధు ప్రస్తావించగా, దీనిపై రగడ చెలరేగింది. ఇరుపార్టీల కౌన్సిలర్లు బాహాబాహీగా దిగగా, కొందరు అడ్డుగా నిలబడి వారించారు. మున్సిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి పోడియం దిగి కౌన్సిలర్ల మధ్యకు వచ్చి సమావేశం సజావుగా సాగేలా చూడాలని కోరారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అడ్డుతగలడం, దాడులకు దిగడం వైసిపి కౌన్సిలర్లకు తగదని, ప్రశ్నిస్తే కొట్టేందుకు వస్తారా అంటూ చైర్పర్సన్ సుబ్బలక్ష్మిని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి నిలదీశారు. సౌకర్యాలు కల్పించకుండా టిడ్కో ఇళ్లను పంపిణీ చేయడం ఎన్నికల స్టంట్గా టిడిపి కౌన్సిలర్లు ఎద్దేవా చేశారు. ఆద్యంతం గొడవలతో సమస్యలపై ఎటువంటి చర్చ లేకుండా మున్సిపల్ సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

వైసిపి ఎన్నికల ప్రచారం ప్రారంభం


ప్రచారంలో పాల్గొన్న బూడి కుటుంబసభ్యులు

ప్రజాశక్తి – మాడుగుల : మాడుగులలో వైసిపి ఎన్నికల ప్రచారాన్ని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, కుమార్తె ఈర్లె అనురాధ మంగళవారం ప్రారంభించారు. ముందుగా మోదకొండమ్మను దర్శించుకుని ప్రచారం మొదలెట్టారు. త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ముందస్తుగా ముహూర్తంతో ప్రచారం ప్రారంభించి, మాడుగులలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి శ్రీనివాస్, జవ్వాది వరహాలు, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు

గందరగోళంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు

ఆన్లైన్, ఆఫ్లైన్ గణాంకాల్లో భారీ తేడా

తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి –కోటవురట్ల: మండలంలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. ఆన్లైన్లో, ఆఫ్లైన్లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇళ్ల గణాంకాల్లో వ్యత్యాసం ఉండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తహశీల్దార్ వెంకటరమణ ఇచ్చిన వివరాల ప్రకారం మండలంలో 885 ఇళ్లకు 657 రిజిస్ట్రేషన్లు అయినట్లు ఆన్లైన్లో ఉండగా, ఆఫ్లైన్లో 748ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగిందని అధికారులు అంటున్నారు. 91 ఇళ్ల తేడా ఉండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రధానంగా పాములవాక 112 ఇళ్లకుగాను ఆన్లైన్ 60 రిజిస్ట్రేషన్ అయినట్లు ఉండగా, ఆఫ్లైన్లో 92గాఉంది.బోడపాలెంలో 111ఇళ్లకు ఆన్లైన్లో 35 రిజిస్ట్రేషన్ జరగ్గా, ఆఫ్లైన్లో 75గా ఉంది. కోటవురట్ల 253 ఇళ్లకు 229 ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి కాగా, ఇక్కడ ఆన్లైన్లో ఆరు తేడా కనిపిస్తోంది. లెక్కల్లో తేడాలను సరిచేసి, శతశాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని తహశీల్దార్ వెంకటరమణ అంటున్నారు.

పించన్ల సొమ్ములో కోతపై విచారణ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కుసర్లపూడిలో గ్రామదేవత పెద్దింటమ్మ పండుగకు పింఛను సొమ్ము కోతపెట్టి, వాలంటీర్ల దేవాలయ ఖర్చులు వనరులు చేయడంపై మంగళవారం ఇఒపిఆర్‌డి సూరజాల, గ్రామ కార్యదర్శులు డి.సుబ్బారావు, సంతోష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు విచారణ చేపట్టారు. గ్రామంలో ఇటీవల కొత్తగా మంజూరైన 13 పింఛన్లతో కలిపి 435మంది పింఛనుదారులుండగా, కొత్త పింఛనుదారుల నుంచి మొత్తం సొమ్మును, మిగిలిన వారి నుంచి రూ.1500 చొప్పున వనరులు చేశారని కొందరు పింఛనుదారులు, మాజీ సర్పంచ్ గండి తాతాజీ సోమవారం మండల తహశీల్దార్, ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇఒపిఆర్‌డి సూరజాల విచారణ చేస్తుండగా, సర్పంచ్ మద్దు అప్పలనాయుడు వర్గీయులు మాజీ సర్పంచ్ గండి తాతాజీ వర్గీయుల మధ్య వివాదం, తోపులాట జరిగింది. పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. దీనిపై పింఛనుదారులు, ఫిర్యాదిలను విచారించిన ఇఒపిఆర్‌డి, నివేదికను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళతానన్నారు.

టిడ్కో ఇళ్లలో సౌకర్యాల లేమి : సిపిఎం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :సౌకర్యాలు కల్పించకుండా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేస్తారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, టి.ఈశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం బలిఘట్టం సమీపంలోని ఇళ్లను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, రహదారులు ఇతర సౌకర్యాలు లేకుండా ఇళ్ళు పంపిణీకి పూనుకోవడం ఎన్నికల స్టంటేనని, దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి - రావికమతం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. విందుభోజనం ఏర్పాటు చేశారు. పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గొలుగొండ : పోర్లు హైస్కూల్లో హెచ్‌ఎం రత్నాజీ ఆధ్వర్యంలో 'ఫేర్‌వెల్' వేడుకల్లో వైస్ ఎంపిపి బాబ్జి, సర్పంచ్ సంతోష్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొండం రాజు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నక్కపల్లి: నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు ,కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : బలిఘట్టం వై జంక్షన్ వద్ద కొద్దిరోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడి, చికిత్స పొందిన బాధితులు వాయిలాడ ఈశ్వరరావు, కొడమంచిలి కాసులకు పట్టణ వైసిపి నేత గుడబండి నాగేశ్వరరావు (జివిఆర్) తన సొంత నిధుల నుంచి రూ. 20వేల ఆర్థిక సహాయం చేశారు.

వాలంటీర్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జోగంపేట పంచాయతీలో మూడు, కొత్త మల్లంపేట పంచాయతీలో ఒక వాలంటీర్ ఖాళీల భర్తీకి ఎంపిడిఓ రత్నకుమారి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇఒపిఆర్‌డి బి.రమణి, పంచాయతీ సెక్రెటరీ రమణారావు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి -నక్కపల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఇఒ కె.నరేష్ సూచించారు. మంగళవారం వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదోతరగతి విద్యార్థుల అభ్యసన తరగతులను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలు రాబట్టారు. పరీక్షల్యేవరకు ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : వేంపాడు హైస్కూల్లో మంగళవారం యోగా శిక్షణను ప్రారంభించారు. హెచ్‌ఎం నర్సింగరావు, పిఇటి రాంకుమార్, వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ కుమార్ ఆధ్వర్యంలో యోగా శిక్షకులు దవరసింగి రాంబాబు ఆసనాలు, ప్రాణాయామంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

గీతంలో జాతీయ భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి- మధురవాడ : పనిచేసే ప్రదేశంలో భద్రతను పెంపొందించడానికి, ఉద్యోగస్తులు తమ జీవన విధానంలో భద్రతపై అవగాహన కలిగించడానికి జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా భారత నౌకాదళ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మంగళవారం భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు.

గీతం వర్సిటీని 'పెన్ స్టేట్' బృందం సందర్శన

ప్రజాశక్తి -మధురవాడ : అమెరికాలోని ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలలో ఒకటైన పెన్సిల్వేనియాలోని పెన్ స్టేట్ విశ్వ విద్యాలయం బృందం మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ వ్యవహరాల ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఒమిక్అన్సారీ, మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రే వెంకటరామణ్, జీవశాస్త్రాల ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామ్ రుద్రభట్ల, విద్యార్థి వ్యవహరాల విభాగం సీనియర్ డైరక్టర్ డాక్టర్ టోడ్ క్లార్క్ గీతంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధపట్టం, గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ, భారత ప్రభుత్వ నూతన విద్యా విధానానికి అనుగుణంగా కోర్సుల రూపకల్పనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల ద్వారా 53 అండర్ గ్రాడ్యుయేట్, 59 పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు నిర్వహిస్తున్నామని, స్థానిక పరిశ్రమలతో మెరుగైన సంబంధాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. గీతంలో ఏటా 417 కంపెనీలు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయని తెలిపారు. పెన్ స్టేట్ విశ్వ విద్యాలయంతో బోధన, పరిశోధన సహకారానికి ఆసక్తితో ఉన్నామని పేర్కొన్నారు.

పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ వ్యవహరాల ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఒమిక్అన్సారీ మాట్లాడుతూ, తమ విశ్వవిద్యాలయం 140కి పైగా కోర్సులు నిర్వహిస్తోందని వీటిలో 50 దేశాలకు చెందిన 10 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం, విశ్వవిద్యాలయంలో పరిశోధకులకు మార్గదర్శకం వహించడం, గీతం అధ్యాపకులకు వర్క్ షాప్, సదస్సుల నిర్వహణలో సహకరించడం, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. గీతం విశ్వవిద్యాలయం కోర్సుల నిర్వహణ, పరిశోధన ప్రగతిని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం బృందం ప్రశంసించింది. కార్యక్రమంలో వివిధ కళాశాలల డీన్లు, డైరక్టర్లు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



గాయత్రీనగర్‌లో సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీచేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -మధురవాడ, పిఎం.పాలెం : టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు కోరారు. జివిఎంసి 5వ వార్డు పార్టీ కార్యాలయంలో వార్డు టిడిపి అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యాన పోలింగ్ బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ, పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలందరూ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన శంఖారావం సూపర్ సిక్స్ పథకాలతో పార్టీ ముద్రించిన కరపత్రాలను, కేలండర్లు ప్రజలకు అందించి వివరించాలని సూచించారు. అనంతరం శంఖారావం సూపర్ సిక్స్ పథకాల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి 5వ వార్డు ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, ఉపాధ్యక్షులు వియ్యపు నాయుడు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం పాలెం గాయత్రీనగర్ సమీపంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పెంటకోట బబ్బెలు, కొప్పాక రామకృష్ణ, తాడేల లక్ష్మి, కసిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని కస్పా జగన్నాథపురం, ముకుందాపురం గ్రామాలలో నూతనంగా నిర్మించిన భవనాలను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం ప్రారంభించారు. కజె.పురంలో 40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సచివాలయ రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, ,రూ.3.5 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు, రూ 40 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ,రూ.14 లక్షలతో పాలగడ్డ నుండి కేఎల్‌బి పట్నం రహదారి పనులు, రూ.,3 లక్షల తో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్, రూ.55.30 లక్షలతో కె.జే.పురం నుండి అప్పలరాజుపురం బిటిరోడ్డు పనులను ప్రారంభించారు. ముకుందాపురంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23 లక్షలతో రైతు భరోసా భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో మినీ కల్యాణ మండప నిర్మాణానికి, కె.జె.పురం కరణం మదుం నుంచి వంటర్ల పాలెం పోవు సీసి రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు ఎమ్.కోటపాడులో వీరాంజనేయ స్వామి తీర్థంలో పాల్గొన్నారు. ఎంపిపి రాజారామ్ పాల్గొన్నారు .

విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి చరిత్రలో సాక్ష్యంగా నిలిచిన నర్సీపట్నం కవర్టు, హైటర్ల సమాధులున్న అర ఎకరం స్థలాన్ని అల్లూరి, గంటం, మల్లు దొరల విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి పరచాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం అనుబంధ సంస్థ కోటనందూరు అల్లూరి సేవా కమిటీ అధ్యక్షులు లక్కాకుల బాబ్జి ఆధ్వర్యంలో 20 మంది కమిటీ సభ్యులు కవర్ట్, హైటర్ల సమాధులు ఉన్న ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. జెసిబితో చెత్తంతా తొలగించి ట్రాక్టర్‌పై తరలించారు. అల్లూరి పార్కు, సమాధుల అభివృద్ధికి నిధులు కేటాయించామన్న ప్రభుత్వ ప్రకటనలే తప్ప ఆచరణలో అమలు జరగలేదన్నారు. కెడిపేట ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో అల్లూరి విగ్రహం ఏర్పాటుకు అనుమతులివ్వాలని కోరారు. కార్యక్రమంలో వాడపల్లి వెంకటరమణమ్మ, శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, లక్కాకుల బాబ్జి పాల్గొన్నారు.

62 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం అన్నవరంలో మంగళవారం చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 62 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 36 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. 15 రోజుల్లోగా ఉచితంగా కళ్ల జోళ్లు అందజేయనున్నట్లు దివీస్ సంస్థ సిఎస్‌ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. అవసరమనుకుంటే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మేరుగు ఎల్లాజీ, ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రి సభ్యులు సాయికృష్ణ, సాయి, సంతోషి, దుర్గారావు, భూపతి, దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-పెందుర్తి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పెందుర్తి సెబ్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పెందుర్తి జంక్షన్ సమీపంలో అనుమానస్పదంగా సంచరిస్తున్న కేరళకు చెందిన అనిల్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారించగా అతని వద్ద 18 కిలోల గంజాయి లభ్యమైంది. కేరళ రాష్ట్రం కొల్లం ప్రాంతానికి చెందిన అనిల్ ఒడిశా సరిహద్దులోని విక్రమ్‌సింగ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి విశాఖపట్నం మీదుగా కేరళ తీసుకెళ్తున్నాడు. గత మూడు నెలలుగా ఈ వ్యాపారం సాగిస్తున్నాడు. కిలో రూ.3000కు కొనుగోలు చేసిన నిందితుడు బెంగళూరులో రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సిఐ సరోజదేవి, ఎస్ఐ మహేష్, వేణు, ముసలనాయుడు, సిబ్బంది అప్పారావు, శివ, మధు నాయుడు, అశోక్, రామలక్ష్మి పాల్గొన్నారు.

కత్తితో దాడి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని జానకయ్యపేట గ్రామానికి చెందిన ఈగల నాగేశ్వరరావుపై కత్తితో దాడి చేసి గాయపరిచిన గుత్తుర్తి పైడిరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు.పెదతీనార్ల గ్రామానికి చెందిన నిందితుడు గుత్తుర్తి పైడిరాజు, బాధితుడు ఈగల నాగేశ్వరరావు వద్ద రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు .తీసుకున్న డబ్బులు తిరిగి ఇమ్మని అడిగిన సందర్భంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా పైడిరాజు కల్లు గీత కత్తితో నాగేశ్వరరావుపై దాడి చేశాడు. తల, చేతికి తీవ్ర గాయాలైన నాగేశ్వరరావును స్థానిక సిహెచ్‌సికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుని ఆసుపత్రికి తరలించారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పైడిరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.



డయాలసిస్ రోగికి పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

డయాలసిస్ రోగికి కొత్త పెన్షన్ అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు లక్ష్మీనగర్, సచివాలయం నెంబరు 5 పరిధిలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కూర్మదాస్ తాండవకృష్ణకు కొత్తగా మంజూరైన రూ.10 వేల పెన్షన్‌ను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, వైసిపి నాయకులు కెల్ల సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి కన్వీనర్ బేత దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధి సామాజిక భవనంలో సకల్య స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, అరసవిల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు నెలల పాటు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ శిక్షణా కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కుట్టు శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. శిక్షణా కేంద్రం ఏర్పాటుచేసిన సకల్య స్వచ్ఛంద సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాటిల్డ, షకీల, జ్యోతి, జాలరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



లైబ్రరీలో పుస్తకాలతో చిన్నారులు

ఐఎహెచ్‌వి లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ఆర్‌పి.పేట రైల్వే కాలనీలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ (ఐఎహెవి) ఆధ్వర్యంలో లైబ్రరీని మంగళవారం పాఠశాల హెడ్‌మాస్టారు శ్రీనివాస్, సీనియర్ టీచర్ అరుణ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండి పుస్తకాల చదవడం ఎంతో అవసరం అన్నారు. పిల్లలు వినోదంతో పాటు విజ్ఞానాన్ని కథల పుస్తకాలను చదవటం ద్వారా పొందవచ్చునన్నారు.

'మాకూ అసెంబ్లీ సీట్లు కేటాయించాలి'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్రలో తూర్పు కాపులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని ఎపి తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మజ్జి అప్పారావు కోరారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో తూర్పు కాపులకు సీట్లు పంపకంలో అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ గణేష్ పాల్గొన్నారు.

దక్షిణ కాంగ్రెస్ టిక్కెట్టుకు జగన్నాథరావు దరఖాస్తు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు వైఎస్.జగన్నాథరావు ఆ పార్టీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు విజయవాడలోని ఆంధ్రరత్న భవనంలో మంగళవారం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేశారు. ఆయన స్థానిక మీడియాకు ఆ సమాచారం అందించారు. దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్తగా, పిసిసి సభ్యునిగా, బిసి సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా జగన్నాథరావు పనిచేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌లో ఎంఐఎఫ్ ప్రగతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌లో ఎంఐఎఫ్ నూతన ఆవిష్కరణలు ఎంతగానో దోహదపడుతున్నాయని మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్) వ్యవస్థాపకుడు హర్ష్ మారివాల తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా సహజ వనరులను, ముఖ్యంగా చెట్లను సంరక్షించుకోవడానికి ఐఎంఎఫ్ దోహదపడుతుందన్నారు. అందుకోసం తమ కంపెనీ రూపొందించిన 12 స్టార్టప్‌లు కలిసి వినూత్నమైన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల నిర్వహణకు ఉపయోగపడతాయన్నారు. వీటి ద్వారా 1338 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు రీసైకిల్ చేయబడి 124, 360 టన్నుల సిఒ-2 ఉద్గారాల ఆదా జరిగి, 8300 చెట్లు రక్షించబడ్డాయన్నారు. ఏటా 3.4 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి కాగా భారతదేశంలో కేవలం 30 శాతం మాత్రమే రీసైకిల్ జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల సరఫరా సమస్యను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయటంలో ఎంఐఎఫ్ మద్దతు ఉన్న స్టార్టప్‌లు గణనీయమైన పురోగతిని సాధించాయన్నారు.

ఎడెక్స్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎడెక్స్ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో మంగళవారం విఎస్.కృష్ణా కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. సంఘం విశాఖపట్నం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్రంలో ఉన్న అనేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలలో కనీస మౌలిక వసతులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు లేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఉంటే మరోవైపు ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ఎడెక్స్ అనే కంపెనీతో టెండర్లు కూడా లేకుండా 50 కోట్లు చెల్లించేలా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం దారుణమన్నారు. ఈ రూ.50 కోట్లతో డిగ్రీ, పీజీ కాలేజీల్లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించవచ్చునన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సబ్బవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-సబ్బవరం : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాలువారు సహకరించాలని పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో నాలుగు కిలోమీటర్లు మేరకు పోలీస్‌లు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో శాంతి భద్రతలను నెలకొల్పి ప్రజలలో నమ్మకం కలిగించడానికి ఈ కవాత్ నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ ధనుంజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ప్రజలందరూ సహకరించాలని అచ్యుతాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు కోరారు. తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం రాత్రి గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ శివ బాబునాయుడు, ఆడారి అనంత, ఎస్ మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రియాంక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రియాంక దండి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో, ముఖ్యంగా విశాఖ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి బాటలో నడుస్తుందని చెప్పారు. తనను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇంచార్జ్ మాణికం ఠాగూర్, వైఎస్.షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలో గల దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల నృత్యాలు ప్రదర్శించారు.

పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, హెచ్ఎం సత్యారావు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా ఈ నెల 8 శుక్రవారం నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కెవి.రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్ట నారాయణరావు, గుర్రం నాగేశ్వరరావు,. కాకి సన్యాసి పైడిరాజు తదితరుల జ్ఞాపకార్థం కెవిఆర్ బృందం ఆర్థిక సహాయంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాణించిన వారికి రూ.2008 చొప్పున నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు.

టోర్నమెంట్లో పాల్గొనదలచిన వారు 9492813358, 7995623359, 8374428385 నెంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న అంగముత్తు

విపిఎ ఆధ్వర్యాన సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ భాగస్వాముల సదస్సును సోమవారం హోటల్ నోవాటెల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ అంగముత్తు మాట్లాడారు. పోర్టు భవిష్యత్తు ప్రణాళికలను తెలియజేశారు. అనంతరం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా లబ్దిదారులకు 3.63 కోట్ల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిఒఎపి సెక్రటరీ డాక్టర్ ఎన్.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిసిలను మోసం చేసిన వైసిపి

ప్రజాశక్తి -అనకాపల్లి : గత ఎన్నికలకు ముందు వైసిపి రాష్ట్రంలోని బీసీలను ఉపయోగించుకొని అధికారం వచ్చాక వారిని మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర ఆరోపించారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన జయహో బీసీ బహిరంగ కార్యక్రమం విజయవంతమైన వారు మాట్లాడుతూ జయహో బీసీ సభను చూసి వైసిపి పార్టీకి చెమటలు ఎక్కుతున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పోలరపు త్రినాథ్, పిట్ల రాజు, కాండ్రేకుల వెంకటేశ్వర, బత్తుల లక్ష్మి, వెంకటలక్ష్మి, పెంటకోట శ్రీనివాసరావు, దొడ్డి రాము, జొన్నాడ సురేష్, పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.అప్పలరాజు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీలలో భాగంగా విశాఖపట్నం ఇంటెలిజెన్స్ డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీగా వచ్చారు.

పల్స్ పోలియో కార్యక్రమం పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్‌ఒ ప్రతినిధి డాక్టర్ కెవి శాంతి మంగళవారం పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వివరాల అడిగి తెలుసుకున్నారు. బొజ్జన్న కొండ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీల్లో ఉన్న సున్నా నుంచి ఐదు సంవత్సరాలు పిల్లలకు పోలియో డ్రాప్స్ వేశారా లేదా అని ఆరా తీసి వేసుకొని వారికి డ్రాప్స్ వేసారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మరియమ్మ, ఈశ్వరరావు, ఆశ వర్కర్లు వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : ఈ నెల 9న అమరావతిలో జరుగు వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్గిరాల రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మాదిగ ఉద్యోగులు, రెల్లి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగంపల్లి అనంతరావు, జరగడం నాగభూషణం పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొట్టాలి

అచ్యుతాపురం : ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం ఎస్‌కెఆర్ రెసిడెన్సీలో మంగళవారం జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గస్థాయి కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డ శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, బి రామదాసు, కార్యకర్తలు పాల్గొన్నారు